# కోర్టు తీర్పులు-
# సామాజిక న్యాయం



**బహిరంగ సభ**

**తేదీ: 20.12.2000**

స్థలం: సుందరయ్య విజ్ఞాన కేంద్రం

సమయం: సాయంత్రం 6 గంటలు

అధ్యక్షత: ఎస్. జీవన్‌కుమార్

వక్తలు: మేధాపాట్కర్
(నర్మదా బచావో ఆందోళన్)

కె.జి.కన్నబిరాన్
(పి.యు.సి.ఎల్)

కె.బాలగోపాల్
(మానవహక్కులవేదిక)

రెండు కోర్టు తీర్పుల గురించి ఇవ్వాళ మాట్లాడుకుంటున్నాం.

ఒకటి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, మరొకటి మన రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు.

న్యాయస్థానాలు తీర్పులిచ్చేటప్పుడు వ్యాజ్యం లేవదీసినవారు పరీక్షకు నిలబడతారని మామూలుగా అనుకుంటాము.

ఒక్కొక్కసారి న్యాయస్థానాలు కూడా పరీక్షకు నిలబడతాయి.

ఈ రోజు మన దేశంలో న్యాయస్థానాలు ఎదుర్కొంటున్న పరీక్ష ఒకటి ఉంది. ప్రభుత్వాలు రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకూ రాజ్యాంగం పీఠికకూ విరుద్ధమైన పాలనా విధానాలను శరవేగంగా ప్రవేశపెడుతున్నాయి. రాజకీయపార్టీలేవీ వీటిని ప్రవేశపెట్టబోతామని ప్రజలకు చెప్పి ఓట్లు అడగలేదుగానీ గెలిచి ప్రభుత్వం ఏర్పరచిన తరువాత ప్రపంచ బ్యాంకు చెప్పిందనీ, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశించిందనీ, లేకపోతే దీనిని మించిన విజ్ఞత లేదనీ చెప్పి ఈ మార్పులు ప్రవేశపెడుతున్నాయి.

అప్పుడు న్యాయస్థానాలు ప్రభుత్వానికి ఉండే విధానరచన చేసే అధికారంలో ఏ మేరకు జోక్యం చేసుకోవచ్చు? ప్రభుత్వ విధానరచన రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి ఉన్నంతకాలం కోర్టు జోక్యం చేసుకోవడానికి వీలులేదనీ ఆ పరిధిలో ప్రభుత్వమే రాజనీ మన రాజ్యాంగం అంటుంది.

దీనితో పేచీ లేదు. ఎంత చెడ్డా ప్రజలకు ఏదో ఒక మేరకు జవాబుదారీ వహించక తప్పని రాజకీయ పాలకులు విధానరచన చేయడమే మేలు. ఆ అధికారం న్యాయస్థానాలకు ఇయ్యడం మంచిది కాదు.

కానీ ప్రభుత్వ విధానాలు 'రాజ్యాంగ మౌలికసూత్రాలకు' లోబడి ఉండేటట్టు చూసే బాధ్యతను నిర్వర్తించే న్యాయస్థానాలు తమ కర్తవ్యాన్ని సంకుచితంగా అర్థం చేసుకుంటాయా లేక రాజ్యాంగానికి ఉన్న చారిత్రక పూర్వరంగాన్ని దృష్టిలో పెట్టుకుని దానికి అనుగుణంగా వ్యవహరిస్తాయా అన్నది ఒక ముఖ్యమైన ప్రశ్న.

కేవలం రాజ్యాంగంలోని ఫలానా ఆర్టికల్‌లోని ఫలానా నియమాన్ని ప్రత్యక్షంగా అతిక్రమించినప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకుంటాయా, లేక రాజ్యాంగం పీఠికనూ ఆదేశిక సూత్రాలనూ దృష్టిలో పెట్టుకుని తమ కర్తవ్యాన్ని అర్థం చేసుకుంటాయా అన్నది ఈ ప్రశ్న. ఆ పీఠిక, ఆ సూత్రాలు జాతీయ ఉద్యమస్ఫూర్తిని దేశ భవితవ్యానికి గమ్యంగా నిలబెట్టాయని గుర్తించినట్టయితే న్యాయస్థానాలు తమ కర్తవ్యాన్ని ఈ విధంగా అర్థం చేసుకోవడంలో గల చారిత్రక ప్రాముఖ్యాన్ని గ్రహించగలుగుతాం.

ఈ విషయంలో మన దేశ న్యాయవ్యవస్థ యాభై ఏళ్లుగా ఊగిసలాట ప్రదర్శిస్తూనే ఉంది. తన కర్తవ్యాన్ని ఒకసారి విశాలంగా, ఒకసారి సంకుచితంగా అర్థం చేసుకుంటున్నది. 'మేమున్నది చట్టాన్ని అమలు చేయడానికే తప్ప సంఘసంస్కరణ చేయడానికి కాదు' అని ఒక రోజు, 'రాజ్యాంగంలోని సంక్షేమరాజ్య స్ఫూర్తిని ప్రతీ చట్టంలోనూ చదువుతాం' అని మరుసటి రోజు అంటూ వస్తున్నది.

రెండవ వైఖరి చాలా అవసరమయిన ఈ రోజు మొదటి వైఖరే పైచేయి అవుతున్నదా అని అనుమానించడానికి ఆస్కారం కలిగించే రెండు తీర్పులీరోజు మన ముందున్నాయి.

ఒకటి నర్మదా నదిపైన గుజరాత్ ప్రభుత్వం తలపెట్టిన సర్దార్ సరోవర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలియజేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు.

రెండు, చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సంస్కరణలకు పూర్తి ఆమోదం తెలియజేస్తూ మన హైకోర్టు ఇచ్చిన తీర్పు.

విషయంలో చాలా తేడా ఉన్నప్పటికీ రెండు తీర్పులలోనూ ఆయా న్యాయస్థానాలు ప్రకటించిన సూత్రమేమిటంటే ప్రభుత్వ విధాన నిర్ణయాలలో కోర్టులు చాలా పరిమితంగా మాత్రమే జోక్యం చేసుకోగలవని.

'పాలనా వ్యవస్థ తన పని తాను సక్రమంగానే చేస్తుందని న్యాయస్థానాలు నమ్ముతాయి' అన్న పురాతన సూత్రమొకటి ఉంది. నర్మదా కేసులో సుప్రీంకోర్టు దానిని పునరుద్ఘాటించింది. ఈ యాభైఏళ్లలో తానే ఆ సూత్రాన్ని బాగా కుదించి వేసిన సంగతి సుప్రీంకోర్టు మరిచిపోయింది. పాలనా వ్యవస్థ తన పని సక్రమంగా చేయడం లేదని కోర్టులో వ్యాజ్యం వేసేవారు కొన్ని ప్రాథమిక ఆధారాలు చూపించాలే తప్ప కేవలం అనుమానం మీద కోర్టుకు రావడానికి వీలు లేదన్న సూత్రానికి దానిని సుప్రీంకోర్టు గడచిన రెండు మూడు దశాబ్దాల కాలంలో కుదించింది.

## నమ్మకాల ఆధారంగా నర్మదా తీర్పు

సుప్రీంకోర్టులో కేసు వేసిన నర్మదా బచావో ఆందోళన్‌వారు కొన్నేమిటి, చాలా ఆధారాలే చూపించారు. అయినప్పటికీ సుప్రీంకోర్టు తన విశ్వాసాన్ని వదులుకోలేదు. డ్యాం ఎత్తు 85 మీటర్లు ఉంటే ఎంత ప్రాంతం ముంపుకు గురికాగలదో ప్రజల పునరావాసమే ఇంకా సంతృప్తికరంగా జరగలేదన్న విషయం తన ముందు రికార్డయి ఉండగా, 90 మీటర్ల దాకా ఎత్తు పెంచుకొమ్మని అనుమతి ఇచ్చేసింది. ఏమంటే పునరావాస వ్యవస్థ సంతృప్తికరంగానే ఉందని తాను భావిస్తున్నట్టు ప్రకటించింది. ఆచరణ ఏ విధంగా

ఉందో చూడకుండా, వ్యవస్థ సరిగ్గానే ఉందని తాను నమ్ముతున్నాను కాబట్టి కట్టుకొమ్మని ఆదేశం ఇచ్చేసింది.

అంటే ఇక మీదట ప్రభుత్వం అందమయిన ప్రణాళికలు తయారు చేసి న్యాయస్థానాలకు చూపిస్తే చాలునా? ప్రశ్నించే పిటిషనర్లు ఇంటి ముఖం పట్టవలసిందేనా?

ప్రభుత్వ విధానరచనలో కోర్టులు జోక్యం చేసుకోవు అంటూనే పెద్ద డ్యాంలను సుప్రీంకోర్టు చాలా పొగిడింది. ఈ 40 సంవత్సరాలలో వాటి వల్ల నష్టం కంటే ప్రయోజనమే ఎక్కువని తేలిందని ఏ ఆధారాలూ లేకుండా ప్రకటించింది. వాటి వల్ల పర్యావరణం ధ్వంసం కాకపోగా, మరింత బాగు పడిందనింది. అక్కడ బతికిన ప్రజలు పునరావాస స్థలాలలో మరింత మెరుగయిన జీవితం అనుభవిస్తున్నారనింది. దీనికీ ఏ ఆధారమూ లేకపోగా, అధికభాగం నిర్వాసితులు గతంలో కంటె మరింత అధ్వాన్నమైన స్థితిలో బతుకుతున్నారని తెలిపే పరిశోధనలు మాత్రం అనేకం ఉన్నాయి.

సుప్రీంకోర్టు నర్మదా కేసులోని బాధితులకు అన్యాయం చేయడమేకాక, రాబోయే రోజులలో ప్రభుత్వాల నూతన అభివృద్ధి విధానం ఫలితాలపైన ప్రజలు వేయగల కేసులను ఆదిలోనే బలహీనపరిచే సూత్రీకరణలు అనేకం చేసింది.

## ఏ ప్రశ్నకూ సమాధానం యివ్వని విద్యుత్‌చార్జీల తీర్పు

మన హైకోర్టు విద్యుత్ చార్జీల కేసులో ఇచ్చిన తీర్పు కూడా ఇందుకు తీసిపోలేదు.

ప్రపంచబ్యాంకు ఇచ్చే అప్పుకోసం ప్రభుత్వం ప్రజలకు నష్టకరమైన షరతులకు అంగీకరించిందని అంటే 'ప్రపంచబ్యాంకు పెట్టిన షరతులలో అంతటి కుట్ర చూడలేము' అనింది. ఎందుకు? షరతులను పరిశీలించిన మీదట వాటిలో అభ్యంతరం చెప్పవలసిందేమీ లేదని న్యాయమూర్తులు భావించారా? అదేమీలేదు. 'ప్రపంచబ్యాంకు ఐక్యరాజ్యసమితి అనుబంధసంస్థలలో ఒకటి. భారతదేశానికి ప్రపంచబ్యాంకులోనూ ఐక్యరాజ్యసమితిలోనూ సభ్యత్వం ఉంది. అటువంటప్పుడు ప్రపంచబ్యాంకు అప్పు ఇస్తూ కొన్ని షరతులు పెట్టినంత మాత్రాన అందులో దుర్బుద్ధిపూర్వకమైన కుట్ర ఉందని భావించజాలమ'నింది హైకోర్టు.

నిజానికి ప్రపంచబ్యాంకుకూ ఐక్యరాజ్యసమితికీ సంబంధం ఏమీ లేదు. అదట్లాగుంచి- అధికారం చట్టంలో ఉంటే చాలు, దానిని సక్రమంగా నిర్వర్తించినట్టేననే సూత్రం ఇది. న్యాయస్థానాలు ఈ సూత్రాన్ని విడనాడి చాలా కాలం అయిందిగానీ 'విద్యుత్‌కేసు'లో అది తిరిగి దర్శనమిచ్చింది.

అన్ని రకాల సబ్సిడీలూ ఎత్తివేయాలని ప్రపంచబ్యాంకు పెట్టిన షరతును మన ప్రభుత్వం ఆమోదించడం రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు విరుద్ధమన్న వాదనకు వాస్తవాలలోగానీ చట్టంలోగానీ ఆధారం లేదని హైకోర్టు చాలా ఆశ్చర్యకరంగా కొట్టి పారేసింది. అభివృద్ధి ఫలితమైన సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకూడదన్నది రాజ్యాం ఆదేశిక సూత్రం కాదా? సబ్సిడీలు దానిని నివారించే ఒక మార్గం కాదా?

విద్యుత్ సంస్కరణల విషయంలో రాష్ట్రప్రభుత్వం తన సార్వభౌమత్వాన్ని త్యజించి ప్రపంచబ్యాంకు చెప్పినట్టు నడుచుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్న వాదనను హైకోర్టు విచిత్రమైన తర్కంతో తోసిపుచ్చింది. ఈ విమర్శను కేవలం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టానికి పరిమితం చేసి, ఒక చట్టాన్ని చట్టసభ ఏ కారణంగా చేయదలచుకుందన్న మీమాంస కోర్టులు చేపట్టలేవనీ అందువల్ల ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు ఆ చట్టం చేసిందా లేదా అన్నది న్యాయస్థానాలు తీర్పు చెప్పగల విషయం కాదనీ హైకోర్టు అనింది.

అంటే రేపు ప్రపంచవాణిజ్య సంస్థ పెట్టే ఒత్తిడికి తట్టుకోలేక మన పార్లమెంటుగానీ అసెంబ్లీగానీ మనం సంప్రదాయకంగా వాడుకుంటున్న వేప, పసుపు వంటి వస్తువుల పైన పేటెంట్లు విదేశీ సంస్థలకు ఇయ్యవలసిందేనని చట్టం చేసినా మనం దానిని మన దేశ సార్వభౌమత్వంపైన దాడి అంటూ కోర్టులో ప్రశ్నించడానికి వీలులేదని మన హైకోర్టు అభిప్రాయం.

అదట్లాగుంచి, సార్వభౌమత్వాన్ని వదులుకున్నారని ప్రభుత్వం పైన ఆరోపణ పెట్టింది కేవలం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం విషయంలోనే కాదు. మొత్తంగానే ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సంస్కరణలన్నీ ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకే చేపట్టిందని అభియోగం. చట్టసభల మనోగతాన్ని పరిశీలించే అధికారం కోర్టులకు లేకపోవచ్చునుగానీ ప్రభుత్వమొకపనిని తప్పుడు ఉద్దేశ్యంతో చేసిందన్న అభియోగం వచ్చినప్పుడు దాని పైన తీర్పు చెప్పే అధికారం కోర్టులకు ఉంది. వేసింది ఈ అభియోగమైతే దానిని చట్టసభపైన ఆరోపణకు కుదించి 'ఆ విషయంలోకి మేము పోలేము' అనింది హైకోర్టు.

హైగా విద్యుత్ టారిఫ్‌ను నిర్ణయించిన రెగ్యులేటరీ కమిషన్ తన పని చాలా బాగా నిర్వహించిందని హైకోర్టు అనింది. ట్రాన్స్‌కో ప్రైవేట్ విద్యుదుత్పత్తి దారుల నుండి విపరీతమైన ధరకు కొనుగోలు ఒప్పందాలు చేసుకుందన్న విషయాన్ని ఈ కమిషన్ పట్టించుకోలేదు. ఆ కొనుగోలు ఒప్పందాలనసలు పరిశీలించనే లేదు. ఇది పిటిషనర్లు వేసిన ముఖ్యమైన అభియోగాలలో ఒకటి. దానిని హైకోర్టు తన తీర్పులో ప్రస్తావించనే లేదు. చాలా స్వతంత్రంగా, ఒక న్యాయనిర్ణేతలాగా వ్యవహరించినట్టు కనిపించే కమిషన్ నిజానికి రాష్ట్రప్రభుత్వం అంతకు ముందే ప్రపంచబ్యాంకుకు ఇచ్చిన హామీలకు ఒక తీర్పురూపం ఇచ్చిందన్న అభియోగానికి కూడా హైకోర్టు తీర్పులో చోటు దొరకలేదు. కాగా, ప్రభుత్వ విధానాల తప్పొప్పులు నిర్ణయించడం మా పని కాదంటూనే విద్యుత్‌రంగ సంక్షోభానికి ప్రభుత్వం చెప్పిన కారణాలన్నింటినీ ఆమోదపూర్వకంగా ఏకరవు పెట్టడం ద్వారా ప్రభుత్వ విధానం సరయినదేనన్న అభిప్రాయాన్ని హైకోర్టు కలిగించింది.

మొత్తానికి 'ప్రభుత్వం తన వ్యవహారాలు ఏ విధంగా నడుపుతుందన్న విషయంలో కోర్టులు సులభంగా తలదూర్చకూడదు. ఏదైనా ఒక నిర్దిష్టమైన చట్టాన్ని కచ్చితంగా అతిక్రమించినట్టు చూపిస్తేనే కోర్టులు జోక్యం చేసుకోవాలి' అనే వైఖరి రెండు తీర్పులలోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇది మన కోర్టు అన్ని సందర్భాలలోనూ ప్రదర్శించిన వైఖరి కాదు. రాజ్యాంగ ఆదేశికసూత్రాలు, అంతర్జాతీయ మానవహక్కుల ఒడంబడికల వెలుగులో ప్రభుత్వ చర్యలను పరిశీలించవచ్చునన్నది కూడా భారత న్యాయవ్యవస్థ గతంలో వ్యక్తం చేసిన అభిప్రాయమే.

దానిని కాపాడుకొని మరింత ముందుకుతీసుకోవడం మారుతున్న పరిస్థితులలో చాలా అవసరం కాబట్టి ఈ రెండు తీర్పులనూ చర్చించటం కోసం ఈ సభ పెడుతున్నాం.

**సభకు అందరికీ ఇదే మా ఆహ్వానం.**

15 డిసెంబర్ 2000
హైదరాబాద్

**-మానవహక్కుల వేదిక (HRF)**